# పరివర్తన

'పొరుగిళ్ళకి పెత్తనాలకి వెళ్ళొద్దని ఎన్నిసార్లు చెప్పాలి నీకు?'

'ఎప్పుడు వెళ్ళానండీ, ఎవరుచెప్పారు మీతో?'

'ఎక్కడికీ వెళ్ళకపోతే నిన్నటిపాఠం జ్ఞాపకంచేసావా మరి?

పై ప్రశ్నకు ఇందిర జవాబేమీ చెప్పలేకపోయింది. కాలి బొటన వ్రేలుతో పరధ్యాన్నంగా నేలనురాస్తూ మౌనం వహించింది.

'మధ్యాహ్నం సీతకి పాఠం చెప్పావా?'

ఇందిరకి ఈ ప్రశ్నకికూడా సరియైనజవాబు దొరకలేదు. అప్పట్లో మళ్ళీ ఆమె మౌనంవహించక తప్పిందికాదు.

'సీతా! మధ్యాహ్నం ఎక్కడికి వెళ్ళారు మీరు?'

'ఎక్కడికీలేదు అన్నయ్యా, యింట్లోనే ఉన్నా'మంటూ అన్నయ్య ప్రశ్నకి కొంటెకళ్ళతో సీత చప్పున జవాబు చెప్పింది.

ఇందిర పైసంగతి గమనించకపోలేదు. కాని సీతే ఈరభస కంతటికీ కారకురాలని ఆమెకి మొదట్లో తట్టలేదు. ఎల్లా తట్టుతుందిమరి. ఇద్దరు కూడబలుక్కొనేకదా ఆరోజుపాఠాలు ఎగ్గొట్టి, మహాలక్ష్మమ్మగారి యింటికి పెత్తనాలకి వెళ్ళింది? మహాలక్ష్మమ్మగారి కూతురు సుధ ఆరోజు ఉదయంబండికి అత్తవారింటినుంచి రావటంమూలాన, తనే ఈ పెత్తనానికి సీతను పురికొల్పినా, సీతకూడా అప్పట్లో ఆ ఉత్సాహం కనపరచకపోతే అసలు వెళ్ళేవాళ్ళేకారేమొ? నిజం విచారిస్తే ఈ వ్యూహంలో కొంతవరకు సీతకూడాఉంది. అల్లాంటప్పుడు తనేమో వొట్టి అమాయకురాలైనట్టూ, నేరమంతా ఇందిరదే అయినట్టు రామారావు ఆఫీసునుంచి వొచ్చిందే తడవుగా మధ్యాహ్నం సంగతులన్నీ యితరులకెవరికీ తెలియకుండా

అతనికి అంటించి, మళ్ళీ 'ఎక్కడికీ వెళ్ళలేదన్నయ్యా' అంటూ చక్కలు పలకటంచూచి ఇందిర వొళ్ళు వొక్కమ్మడిగా మండింది.

'అయితే వొదినదగ్గర ఈరోజు పాఠం చెప్పించుకున్నావా?'

'చెప్పు, వొదిన పాఠాలు చెప్పలేదనీ, పెత్తనాలకి తీసికెళ్ళిందనీ!' దొరికిన అవకాశాన్ని కళ్ళారా వొదులుకోవటం ఇష్టంలేక జంకుతూ సాగదీసింది ఇందిర. చివరకి సీత జవాబుచెప్పడానికికూడా త్రుటికాలమైనా అవకాశాన్ని యివ్వకండా—

'ఉన్నతప్పు నీదగ్గర వుంచుకొని దాన్ని సాగదీసి లాభం?'

రామారావు చెల్లెలిని వెనుకేసుకురావటంచూచి ఇందిరకు మరీ రోషం ఎక్కువయింది.

'ఏవిషయంలోనూ, నాతప్పే మీకు ముందర కనపడుతుంది. పెత్తనాలకి అదిమాత్రం రాలేదూ, దాన్నిమాత్రం ఎందుకనరూ?'

'తీసుకెడితే రాకేంచేస్తుంది మరి.'

'నేను తీసుకెళ్ళానా? ఎవరు చెప్పారు మీతో.'

'నీవు తీసుకెళ్ళలేదు—అదే నిన్ను రెక్కపట్టుకు లాక్కెళ్ళింది, అంతేనా?'

'ఆమాట ఎవరన్నారు?'

'ఎవరనాలేమిటీ, స్ఫుటంగా చెప్పకపోతేమాత్రం అర్థంకాదా నాకు!'

'ఎందుకు అర్థంకాదు మీకు, అపార్థాలు బాగానే అర్థమవుతాయి లెండి.'

'ఊరుకున్నాకొద్ది మాటలు మహాజోరుగా వొస్తున్నాయి. రేపటి నించీ నీవు యింట్లోంచి కదలటానికి వీలులేదు— తెలిసిందా?'

'స్త్రీ స్వాతంత్ర్యం, స్త్రీ స్వాతంత్ర్యం అంటూ వొకటే గోల పెడుతారు. ఇదేనా ఏమిటండీ మీరు నాకిస్తూవున్న స్వాతంత్ర్యం?'

'స్వాతంత్ర్యం అంటే ఇచ్ఛికంగా విహరించటంకాదు. అసలు అక్కడే పొరబడుతున్నావు నీవు. జన్మలో మానవుడికి కొన్ని హక్కులూ, విధులూ సంక్రమిస్తాయి. జీవితంలో, హక్కుల్ని వినియోగించుకున్నా, వినియోగించుకోకపోయినా విధుల్ని మాత్రం సరిగ్గా నియమబద్ధంగా నిర్వర్తించటమే స్వాతంత్ర్య మన్నమాట-అసలు 'స్వాతంత్ర్య' మంటేనే నియమబద్ధ జీవితమని నా ఉద్దేశ్యం.'

రామారావు మాటల్లోని అంతరార్థం ఇందిరకి కొంతవరకు అర్థం కాకపోలేదు. కాని ఆమెది ఓటమిని వొప్పుకునే స్వభావంకాదు.

'మీ ఉద్దేశ్యాలతో నాకు నిమిత్తంలేదు. మీరు చెప్పదలుచుకున్న సంగతి నిక్కచ్చిగా చెప్పండి. ఆవిధంగానే ప్రవర్తించడానికి ప్రయత్నిస్తాను' అంది విసుగ్గా.

'రేపటినుంచీ నీవు యిల్లు కదలటానికి వీలులేదు- మధ్యాహ్నం, నీవు నీపాఠం జ్ఞాపకం చేసుకొని, సీతకి పాఠం చెప్పాలి.'

'రేపటినించీ ఎక్కడికీ కదలను. కాని ఈ పాఠాలు చెప్పటం, ఈ పాఠాలు నేర్చుకోవటం మాత్రం నాచేతకాదు.'

రామారావు 'ఎల్లా చేతకాదో చూస్తా' నంటూ వుండగానే తోక తొక్కిన తాచులాగ టీ కాచటానికి లోపలికెళ్ళింది ఇందిర.

* * * *

ఇందిర కాపురానికి వొచ్చిన కొత్తలోనే రామారావుకు హైద్రాబాదు Central Bank లో ఉద్యోగమైంది. భోనగిరు తాలూకాలోని ఒక కుగ్రామం నుంచి, సంసారం ఉద్యోగధర్మంవల్ల హైద్రాబాదుకు మార్చాల్సి వొచ్చింది రామారావుకి. తల్లిదండ్రులూ, బంధువులూ పూర్వాచార పరాయణు లవటంవల్ల పట్నవాసపు అనాచారాలకి దడిసి వాళ్ళేవళ్ళూ, తనతో హైద్రాబాదుకు వొచ్చి వుండటానికి వొప్పుకోలేదు

విధిలేక తనొక్కడే భార్యా, చెల్లెలూ సమేతంగా హైద్రాబాదుకు వొచ్చి ఫీలుఖానాలో (ఆ బజారులో ఇంటిఅద్దె చాలా చౌక గనక) కొత్తగా సంసారం పెట్టాడు.

ఇందిరకికూడా హైద్రాబాదు వొచ్చేవరకూ పట్నవాసమంటే ఏమిటో తెలియదు. ఇందిర తలిదండ్రులకు వొకతే వొకకూతు రవటంవల్ల చిన్నప్పటినించీ ఆమె చాలా గారాబంగా పెరిగింది. బాల్యంనించీ గారాబంగా పెరగడంవల్ల రామారావుతో హైద్రాబాదులో జీవితం గడపటం అప్పుడప్పుడు కొంత కష్టంగానే తోస్తూవుండేది ఆమెకి.

ఇందిరకి కొద్దిగా తెలుగు వొచ్చు. తండ్రి సంస్కృతం చెప్పించటానికి ప్రయత్నం చేసాడు కాని ఇందిరకు అశ్రద్ధవల్ల ఆ చదువు వొంటబట్టలేదు.

రామారావు మొన్న మొన్ననే ఇందిరకి ఇంగ్లీషు చెప్పటం ఆరంభించాడు. ఆ చదువు యింకా బాలారిష్టదోషాల్లోంచి బయటపడలేదు.

* * * *

సాయంత్రం ఎల్లానో గడిచిపోయింది. చీకటిపడడంతోనే సీత రోజూ వొదినెపంక్తికి వుండేదల్లా ఆరోజు అన్నయ్యపొత్తులోనే భోంచేసి, కొంచెంసేపు అన్నయ్యకి కబుర్లుచెప్పి, ఇందిర యింటిపని ముగించుకోక పూర్వమే, ఆరాత్రిపట్టుకు అన్నయ్య పక్కలోనే పడుకుని నిద్రపోయింది హాయిగా—

ఇందిర ఆరోజు 'తలనెప్పిగా వుం'దన్న మిషతో పాఠం చెప్పించుకోవటం మానేసింది.

మరుసటిరోజు ఉదయం సీత ఎప్పుడు లేచిందో ఎవరికీ తెలియదు. రామారావు కాఫీతాగేప్పుడుమాత్రం ఎక్కడినించో ప్రత్యక్షమైంది. భోజనాలదాకా మళ్ళీ అదృశ్యమైంది.

సీతంటే ఇందిరకి నిన్నటినుంచీ కొంచెం కోపంగానేవుంది, అనవసరంగా అన్నయ్యతో చాడీలుచెప్పి, తన్ని మహాలక్ష్మమ్మగారికూతురు సుధని నిన్న సాయంత్రం మళ్ళీ చూడకండా చేసిందని. సీతసంగతే పట్టించుకోకండా ఇందిర మీదుమీదుగా తిరగటం మొదలెట్టింది. రామారావు ఆఫీసుకు వెళ్ళింతరువాత సీతకి తగిన శాస్తి చేతామనికూడా సంకల్పించుకుంది ఆమె అప్పట్లో—

సీత వొదినెవాలకం గమనించకపోలేదు. అందుకోసమే ఉదయం నించీ అన్నయ్య కొంచెం కనుమరుగుఅవుతే, వొదిన ఎక్కడ తన్ని పోతుందో అని ఆమె అంటిముట్టకండా తిరుగుతున్నది.

సీత తొమ్మిదిగంటలకల్లా మళ్ళీ ఎక్కడినించోవొచ్చి స్నానం చెయ్యకండానే అన్నయ్యపొత్తులో రెండు మెతుకులు గతికింది. రామారావు ఆఫీసుకు వెళ్ళకపూర్వమే మళ్ళీ యింట్లోంచి అదృశ్యమైంది.

ఇందిర భోజనంచేసి, విస్తళ్ళెత్తి, కాళ్ళుచేతులు కడుక్కొని వంటయింట్లోంచి యివతలికి వొచ్చేసరికి సీత కనపడలేదు. పోనీ, కాసేపు అయిన తరువాత వొస్తుందేమోనని పాన్‌దాను ముందర వేసుకొని తమలపాకు వేసుకోవటం మొదలెట్టింది. తమలపాకు వేసుకోవటం పూర్తి అయినా, సీత ఎంతకూ రాదు. మహాలక్ష్మమ్మగారి యింటికి ఆడుకోవటానికి వెళ్ళిందేమో వెళ్ళి లాక్కొద్దామనుకుంది. కాని నిన్ననేకదా తనభర్త యింట్లోంచి కదలవద్దని చెప్పిందీ. 'ఈ రెండు నిమిషాల్లో తాను యింట్లో నించి వెళ్ళినసంగతి ఎవరుచెబుతారులే' అనుకుని లేచి నిలుచుంది. అమ్మయ్యో! మళ్ళీ ఆ సీతే చెబుతే—నిన్న చెప్పలేదు కనకనా మళ్ళీ ఈరోజు చెప్పకండా వూరుకునేందుకు. ఎదురింటి నారాయణరావు అబ్బాయి మధు ఏమన్నా వొస్తాడేమో అతనితో సీతని పట్టితెప్పించాలనుకుంది. కాని మధుకూడా ఎంతకూ రాలా. విసిగెత్తి పక్కపైన మేను వాల్చింది ఇందిర. పడుకున్నదే తడవుగా నిద్రముంచుకొచ్చింది. రామా

రావు ఆఫీసునించివొచ్చి తలుపు తట్టేదాకా మళ్ళీ ఆమెకు మెలుకువ రాలేదు.

నిద్దరకళ్ళతో తలుపుతీసి, కళ్ళు నులుపుకుంటూ లోపలికి వొచ్చే దాకా సీతసంగతి జ్ఞాపకంరాలేదు ఇందిరకి.

ఆఫీసులో అలసివొచ్చిన రామారావుకి సీతసంగతి అప్పుడే చెప్పటం భావ్యంకాదని తెలుసుకోని టీ కాచటానికి లోపలి కెళ్ళింది. రామారావు బట్టలువిప్పి కాళ్ళు కడుక్కునేసరికి ఇందిర స్టౌమైన టీకాచి రామారావు వున్న గదిలోకొచ్చింది. సీత ఈ రెండు నిమిషాల్లోనే ఎప్పుడు వొచ్చిందో తెలియదు. ఏమీ తెలియనట్లుగా అమాయకంగా అన్నయ్యతో కబుర్లు చెబుతూవుంది.

ఇందిరకి ఆ దృశ్యం చూసేసరికి వొళ్ళుమండింది.

'ఉదయంనించీ ఎక్కడికి వెళ్ళారండీ సంచారం?'

పై ప్రశ్నకి సీతకి నోట మాట పెకల్లేదు. వగరుతిన్నదానికిమల్లే కంఠం అప్రయత్నంగా బిగుసుకుపోయింది. చేసేదేమీలేక గుడ్లు మిటక రిస్తూ అల్లానే నుంచుంది స్తంభానికిమల్లే.

'ఏం, ఎక్కడికి వెళ్ళిందేమిటీ' అన్నాడు రామారావు టీ చప్పరిస్తో.

'ఎక్కడికి వెళ్ళిందో దాన్నే కనుక్కోండి!' అంది ఇందిర అమాంతంగా.

'సీతా! ఎక్కడికి వెళ్ళావమ్మా' అన్నాడు రామారావు చెల్లెల్ని బుజ్జగిస్తో—

అన్నయ్య బుజ్జగింపుల్తో సీతకు కొంచెం ధైర్యమొచ్చింది.

'అన్నయ్యోయి! మరేం......మరేం......

'అబ్బా ఎంత నంగనాచివే' అంటూ సీత వాక్యం పూర్తిచేయక ముందే సాగతీసింది ఇందిర.

రెండురోజులనించీ సీతపై ఇందిర ధుమధుమలాడటం రామారావు గమనిస్తూనే వున్నాడు. తీరా కొడుతుందేమోనని భయమేసి, 'తొమ్మిదేళ్ళ ముండని పట్టుకొని ఏమిటా మాటలు' అని గట్టిగా మందలించాడు.

ఇందిరకి కళ్ళనీళ్ళ పర్యంతరమైంది. అయినా బింకంగా—

'అబ్బా! ఎంత చిన్నపిల్లండీ అది మీ కళ్ళకీ' అంది.

సీత తొమ్మిదేళ్ళ దనేసరికి రామారావుకి ఒక ఆలోచన తట్టింది. అయితే ఇందిరమాత్రం ఎన్నేళ్ళదని—ఇంకా పదిహేనేళ్ళు పూర్తిగా నిండలేదు. అల్లాంటప్పుడు ఇందిరమాత్రం చిన్నపిల్లకాదూ? పదిహేనేళ్ళ దాన్ని పట్టుకొని పొరుగుయిళ్ళకి వెళ్ళొద్దని నిన్న శాసించిన సంగతి జ్ఞాపక మొచ్చి రామారావుపైన చన్నీళ్ళు ఒక్కుమ్మడిగా పోసినట్టు అయింది.

ఆ తరువాత ఏమీ మాట్లాడలేకపోయాడు ఇందిరతో—

రామారావు అకస్మాత్తుగా, మాటలమధ్యలో మౌనంవహించటం గమనించి ఇందిరకి ఆశ్చర్యంవేసింది.

తరువాత, పొరుగిళ్ళకి పేత్తనాలకి వెళ్ళటం విషయంలో ఎక్కువ కట్టుబాట్లు లేవన్న సంగతి ఆమె అసలు గమనించనేలేదు.

ఇందిర ఆశ్చర్యం ఆశ్చర్యంగానే వుండిపోయింది. ఈరోజువరకూ ఇందిరకు రామారావు మౌనానికి కారణం తెలియనే తెలియదు. అసలు తెలుసుకోలేదేమోకూడాను.